# పరస్పరం




ముందు అనుకోకుండా అకస్మాత్తుగా తట్టిన ప్రయాణం అది రాఘవరావుకి.

అంతకు ముందు రోజు సాయంత్రం ఏం తోచక డాబామీద పచార్లు చేస్తుంటే గాలిలో తేలొచ్చి ఎక్కడ్నించో దూరం నుంచి ఆ పాట వినిపించింది. దూరం వల్ల ఆ పాట తాలూకు సంగీతమే తప్ప సాహిత్యం వినపట్టంలేదు. ఎప్పటిదో చాలా ఏళ్ళనాటి పాతపాట, రాఘవరావు చిన్ననాటి పాట, ఏలూరు కాలం నాటి పాట.

ఆ పాటతోటే ఏలూరు, ఏలూరు జ్ఞాపకాలు రాఘవరావుని చుట్టుముట్టాయి. ఏలూరు వెళ్ళొస్తే అనుకున్నాడు. అన్నిరకాలుగా అవకాశం కలిసిరావడం వల్ల వెంటనే ప్రయాణం పెట్టుకున్నాడు.

మూడురోజులు గడిచేటప్పటికే శెలవ విసుగనిపించింది. కావాలని పెట్టిన శెలవ కాదు.

ఆఫీసువాళ్ళు బలవంతంగా యిచ్చింది. ఇంతమంది వుద్యోగులకి యింత శాతం ప్రమోషన్లని లెక్కకట్టి చేసిన ప్రమోషన్ వల్ల రాఘవరావు ఆఫీసరయ్యాడు. ఆఫీసరయ్యాక వో నెల ఎవరిదో లీవ్ వేకెన్సీలో పనిచేశాడు. ఆ ఆసామి తిరిగి రావటంతో రాఘవరావుకి ప్లేస్ లేకుండా పోయింది. శెలవేనా పెట్టు లేదా మరో వూరేనా వెళ్ళన్నారు. ఒక్కసారి బైటికి వెడితే తిరిగి హెడ్ ఆఫీసుకి రావటం కష్టం. అందుకే నలభై అయిదురోజుల శెలవ తీసుకోక తప్పింది కాదు.

తింటం, పడుకోటం, యిల్లు సర్దటం... యిలా మొదటి రెండురోజులూ గడిపాడు. మూడోరోజు పూర్తిగా ఖాళీ. నిద్ర కూడా పట్టలేదు. భార్యకి యింటిపని, కీళ్ళనొప్పులు. పిల్లలకి కాలేజీ.... ఎవరి పనులు వాళ్ళవి. ఎవరు మాట్లాడినా పదిపదిహేను నిముషాలే. యీ నలభై అయిదు రోజులూ గడపటం ఎలా? అనిపించింది రాఘవరావుకి. ఎవరి తాపత్రయం వాళ్ళది. కలిసి గడిపే సమయం లేని యీ జీవితం ఏమిటని డిప్రెస్ కూడా అయ్యాడు.

నాలుగోరోజు మరీ బోర్ కొట్టింది. ఆ సాయంత్రం డాబా మీద తిరుగుతుంటేనే ఆ ప్రయాణం తట్టింది.

పుట్టి పెరిగిన వూరు ఏలూరు. అక్కడో యిల్లు కూడా వుండేది. కానీ అవసరానికి రాఘవరావు తండ్రి ఆ యిల్లు అమ్మేయటంతో ఆ వూరితో సంబంధాలు తగ్గిపోయాయి.

హైద్రాబాదులో వుద్యోగం. బతుకుతో పోటీ. రకరకాల శ్రమ.... యిల్లు కట్టటం. పిల్లల భవిష్యత్తు గురించి తాపత్రయ పట్టం. యీ రకం హడావిడిలో రాఘవరావు తిరిగి ఏలూరు వెళ్లలేదు. వెళ్ళాల్సిన అవసరమూ రాలేదు. కానీ ఆ వూరు మీంచి వెళ్ళినప్పుడల్లా రైల్లోంచే..... ఆ స్టేషన్ని..... ఆ కాలేజీని..... కనిపించే ఆ రోడ్లనీ ఎంతో లాలనగా చూసుకునేవాడు.

ఇప్పటికి తిరిగి ఆ వూరు వెళ్ళే అవకాశం వొచ్చింది. ప్రయాణం అనుకున్న మర్నాడే బైలుదేరాడు.

పనేమీ లేదు. వూరికే వెళ్ళి వూరు చూట్టం. తెలిసిన వాళ్ళు ఎవరేనా కనిపిస్తే కలుసుకోటం, అమ్మేసిన యిల్లు, తిరిగిన వీధులు, గతం.... వోసారి చూసుకోటం... అంతే.

అప్పటి స్నేహితులు యింకా అక్కడే వుంటారన్న నమ్మకం లేదు. కేవలం వూరు మీద అభిమానం. ఆ ప్రయాణం చేస్తుంటే చిత్రంగా వుంది రాఘవరావుకి. తమకి తెలిసున్న వాతావరణానికి పసివాళ్ళు ఆనందపడినట్టు ఆనందంగా వుంది నలభై ఏడేళ్ళ రాఘవరావుకి.

వోపిగ్గా గుర్తు తెచ్చుకోవాలే కానీ.... గతం యిచ్చే అనుభూతి, తృప్తే వేరు అనుకున్నాడు.

రైల్లోనూ నిద్రపట్టలేదు రాఘవరావుకి. ఏలూరు, ఆ వీధులు.... కాలవ.... లాకులు.... కాలేజీకి వెళ్ళడం... గోపాలకృష్ణా టాకీస్ సెంటర్.... సినిమాల కోసం వూళ్ళ నుంచి బళ్ళు కట్టుకుని మరీ వచ్చే జనం.... వాళ్ళ సందడిలో బడ్డీ కొట్లో స్నేహితుల్తో తాగిన టీలు.... అర్ధరాత్రి దాటినా తమ వీధిలో అరుగుల మీద కూచుని స్నేహితుల్తో చెప్పుకున్న కబుర్లు.... చిన్న చిన్న సరదాలు... ఆడపిల్లలు.... వాళ్ళని ఏడిపించే ఎడ్వెంచర్లు..... అన్నీ గుర్తొస్తున్నాయి.

అలాగే గబుక్కుని వసంత గుర్తొచ్చింది. అంతే రాఘవరావు ఆలోచన ఒక్కసారి ఝల్లుమంది.

'అవును వసంత ఎక్కడుందో, ఎలావుందో ఒకవేళ ఏలూరులోనే వుందేమో' అనుకున్నాడు. అలా అనుకుంటుంటే నలభై ఏడేళ్ళ రాఘవరావు శరీరం వెన్నెముకతో సహా జివ్వుమంది.

ఆనాటి వసంత రూపం ఆలోచనలోకి చొచ్చుకునొచ్చింది. పొడుగ్గా, నిండుగా, ముఖ్యంగా ఆ

కళ్ళు.... నల్లటి ఆ కళ్ళల్లో చిలిపి పొగరుమోత్తనం వుండేది. ఎంతో పొగరుగా చూసేది వసంత. అదే వసంతలో గొప్ప ఆకర్షణ.

వసంత వాళ్ళ స్థితి కూడా దానికి అనుకూలగానే వుండేది. ఆ వీధి మొత్తంలోకి వాళ్ళదే బాగా డబ్బున్న యిల్లు. అందదని తెలిసినా వసంతని రాఘవరావూ ఆరాధించాడు. ఒకే వీధి అవటం వల్ల ఒకళ్ళింటికి మరొకళ్ళు వచ్చిపోతుండేవారు. సరదాగానే మాట్లాడేది.... వేళాకోళాలు ఆడేది.... ఏడిపిస్తే తిరిగి ఏడిపించేది.

వోసారి రాఘవరావుని 'నీ జుట్టు చాలా బావుంటుంది' అంది. మరోసారి తెల్లటి బట్టల్లో ఎంతో బావున్నావంది. అలాగే వోసారి 'ఆ ముదురురంగు డ్రస్సేమిటి.... మునిసిపాలిటీ యూనిఫాంలా ఛండాలంగా వుంది' అంది.

తనిష్టమొచ్చినట్టు వీచే గాలిలా వుండేది వసంత. అలాంటి వసంత పెళ్ళయి వెళ్ళిపోయే ముందు అన్న మాట మాత్రం రాఘవరావుకి చాలా ఏళ్ళు గుర్తుంది.

"నువ్వంటే యిష్టమే రఘూ.... కానీ ఎందుకో ధైర్యం చెయ్యలేకపోయాను. చేసుంటే నీకే దక్కి వుండేదాన్ని" అని.

వసంత అన్న ఆ మాటల్లో ఎన్నో అర్థాలు, మరెన్నో ఆశ నిరాశలు స్ఫురించి రాఘవరావు చాలారోజులు మధనపడ్డాడు. చాలారోజులు వసంత అన్న ఆ మాటల్నే మననం చేసుకున్నాడు.

'ఆ వసంత యిప్పుడు ఏలూర్లోనే వుంటే.... వుంటే అయినా ఎందుకుంటుంది. అప్పుడే వెళ్ళిపోయిన మనిషి' అనుకున్నాడు.

అలాగే ఆలోచిస్తుంటే వుండే అవకాశం లేకపోలేదని కూడా అనిపించింది రాఘవరావుకి.

'తల్లిదండ్రులకి వసంత ఒకత్తే కూతురు. ఆ యిల్లు, ఆస్తి ఆమెకే చెందుతాయి. భర్తతో కలిసి ఏలూరే వచ్చేసి వుండొచ్చు. లేకపోతే లేకపోతే....'

మరో భయంకరమైన ఆలోచనొచ్చింది రాఘవరావుకి. ఆ ఆలోచనకి వులిక్కిపడ్డాడు. అయినా ఆ ఆలోచన ఆగలేదు. 'ఒకవేళ వసంతకి భర్తపోయి, వైధవ్యం వచ్చుంటే వెనక్కి పుట్టింటికి వచ్చేసి వుండొచ్చుగా'.

అంతే ఆ ఆలోచన వెనకే చాలా ఆలోచనలొచ్చాయి రాఘవరావుకి. ఆ ఆలోచనలన్నింటికీ వసంతే కేంద్రం. ఆనాటి వసంత చిలిపితనం, పొగరుమోత్తనం గుర్తొచ్చాయి రాఘవరావుకి. ఇప్పుడు వసంత మరింత నిండుగా వుండుంటుంది.... అనుకున్నాడు. 'నిండుదనమే కాదు... బోల్డంత ఆస్తి, డబ్బూ.... పైగా మరింత ధైర్యం, తెగువా వచ్చే వుంటాయి' ఊహలే అద్భుతమైన అనుభవంలా వున్నాయి రాఘవరావుకి.

ఒకరోజు లేస్తే, ఒకరోజు లేవని భార్య అనారోగ్యం వూహలో మెదిలేటప్పటికి, వసంత మీద ఆశ మరింత పెరిగింది. వూహలు వూరిస్తున్నా తన ఆలోచనలో వున్న నైచ్యం కొద్దిగా ముల్లులా పొడుస్తూనే వుంది రాఘవరావుని. ఆ ముల్లు పోటుకి వుపశమనంగా తనకి తనే సర్ది చెప్పుకున్నాడు.

'తనంతగా తాను పూనుకుని చేస్తున్న తప్పేం లేదు. వసంత ఆ పరిస్థితిలో వుండి అంతా కలిసొస్తేనే. పైగా యిదంతా పూర్తిగా తన స్వార్థం కూడా కాదు. ఆనాటి వసంత ఆశ కూడా వుంది. అన్నీ సవ్యంగా జరిగితే వసంత ఆస్థితో పిల్లల భవిష్యత్తు వెయ్యిరెట్లు బాగు చేయచ్చు...."

అలా వూహలు సాగుతుంటే ఎంతో థ్రిల్లింగా వుంది రాఘవరావుకి. ఎంతో సాదాగా, డల్‌గా వున్న జీవితం, మళ్ళీ వుత్సాహంగా, గొప్పగా మారిపోయే అవకాశంలా వుంది యీ వూహ.

తెల్లారుఝామున నాలిగింటికి ఏలూరు చేరాడు రాఘవరావు. లాడ్జిలో రూము తీసుకుని స్థిమితపడేటప్పటికి అయిదయింది. కొంచం అలసటగా వున్నా నిద్రపోవాలనిపించలేదు.

తెల్లగా తెల్లారటం కోసం, ఆ తర్వాత సూర్యోదయం కోసం కొత్తరోజు కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూశాడు రాఘవరావు.

ఏలూరు వీధులు.... అమ్మేసిన తమిల్లు.... స్నేహితుల్తో తిరిగిన రకరకాల స్థలాలు... యివన్నీ రాఘవరావు ఆలోచనలోంచి పక్కకి తప్పుకున్నాయి.

వసంత రూపం ఒక్కటే అతని ఆలోచనని పూర్తిగా కమ్ముకుంది.

★ ★ ★

కూర్చున్న రిక్షా ఆ వీధిలోకి తిరుగుతుంటే గుండె దడదడలాడింది రాఘవరావుకి. ఆతృతకి వొళ్ళంతా చిరుజ్వరం వచ్చినట్టుంది.

యిల్లు కనపడుతోంది. అదే యిల్లు. తనకి బాగా పరిచయం వున్న వసంత యిల్లు.

యింటి ముందు రిక్షా దిగి డబ్బిచ్చాడు.

యిల్లు అలాగే వుంది. పోతే పైన మరో అంతస్థు వేసినట్టుంది. నెమ్మదిగా మెట్లెక్కాడు.

వసంత వుందో.... లేదో.... అసలు యింకెవరేనా వున్నారో.... యిదివరకు లేంది.... గుమ్మానికి కాలింగ్‌బెల్ వుంది. బెల్ కొట్టాడు.

తలుపు తెరుచుకోటానికి పట్టిన రెండు నిమిషాలు రాఘవరావు మనసులో చెప్పలేనంత అలజడి రేగింది. ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో, ఏం జరుగుతుందో వూహమాత్రంగానేనా తెలియని అలజడి.... అయినా ఏదో వుద్వేగం.... ఏదో అద్భుతం సాక్షాత్కరిస్తుందన్న ఆకాంక్ష.

పదహారేళ్ళ అమ్మాయి తలుపు తీసింది..... తీసి "ఏం కావాలండీ..." అంది.

ఏమనాలో తెలియక ఓ క్షణం తడబడ్డాడు రాఘవరావు.

తడబడి చివరికి "చాలా ఏళ్ళ క్రితం వసంతని యీ యిల్లు వాళ్ళదే. ఆవిడ వున్నారేమోనని" అన్నాడు.

రాఘవరావు అంత తడబడ్డాడు కాని, ఆ అమ్మాయి వెంటనే సమాధానం చెప్పింది. "వున్నారు. లోపలికి వచ్చి కూచోండి. పిలుస్తాను...." అంది.

రాఘవరావుకి మళ్ళీ ఒళ్ళు జలదరించింది. తను మొత్తం మనిషంతా దూది తగ్గై గాలిలో తేలుతున్నట్టు ఆ యింట్లోకి నడిచాడు.

ఆ అమ్మాయి లోపలికి వెడుతున్నదల్లా ఆగి "ఎవరొచ్చారని చెప్పమంటారు" అనడిగింది.

"రాఘవరావు వచ్చాడని చెప్పమ్మా" అన్నాడు.

రాఘవరావు కూచున్న సోఫాకి ఎదురుగా వసంత తండ్రి ఫోటో ఉంది.

రాఘవరావు మనసుకి గొప్ప తృప్తిగా వుంది. వసంత వుంది. అదొక్కటే తెలుస్తోంది. అతనికి చెప్పలేనంత వుత్సాహంగా, థ్రిల్లింగా వుంది.

లోపల్నించి ఆ అమ్మాయి కన్నా ముందు వసంతే వచ్చింది. రాఘవరావు వూహించినట్టే వుంది.

అదే అందం, అదే మెరుపు, అదే చూపు. పోతే రాఘవరావు వూహకి తగినట్టు భర్త లేకుండా లేదు. కొట్టొచ్చినట్టు చక్కటి బొట్టుతో మెరిసిపోతోంది.

'నువ్వేనా.... నువ్వే అయ్యుంటావు అనుకున్నాను..." అంది. 'నీ గురించి విన్నాను' అంది. 'యీమధ్యే నీ హైద్రాబాద్ ఎడ్రస్ కూడా తెలిసింది. 'మావారితో, పిల్లల్తో కలిసి హైద్రాబాద్ వచ్చి నేనే నిన్ను, నీ సంసారాన్ని చూద్దామనుకున్నాను. నువ్వే వచ్చావు' అంది.

చెప్పిన కబురు చెప్పకుండా గంటసేపు ఎన్నో కబుర్లు చెప్పింది వసంత.

చిన్నప్పటి మాటతీరే. చిన్నప్పటి గొంతే. గతంలో మాట్లాడినంత సూటిగా, స్వచ్ఛంగా, అలాగే మాట్లాడుతోంది, నవ్వుతోంది.

రాఘవరావుకి పిచ్చెక్కినట్టయింది.

వసంతకి వైధవ్యం రానందుకు కాదు. అతని ఆశ, వూహ తలకిందులైనందుకూ కాదు. వసంతకీ, తనకీ మధ్య వున్న తేడా తెలిసి..... కొన్ని గంటలేనా అసందర్భంగా, అసహ్యంగా, సాధ్యాసాధ్యాలు వూహించకుండా తన మనసుని కమ్మేసిన ఆలోచనల్లోని నైచ్యం తెలిసి....

వసంత గలగలా మాట్లాడుతోంది. ఎన్నో ఏళ్ళకి చిన్ననాటి నేస్తం కలిశాడన్న వుత్సాహం ఆమె ప్రతి పలుకులోనూ వుంది.

తనెక్కడో చాలా అట్టడుగున వున్నట్టుంది రాఘవరావుకి. వసంతకి వైధవ్యం అన్నదే దారుణమైన ఆలోచన. అదలా వుంచి 'తన భార్య గురించి, వసంత గురించీ ఛండాలంగా సాగిన ఊహలు.... ఎంత అమానుషం....' అనుకున్నాడు.

ఎంత తొందరగా వీలైతే, అంత తొందరగా వసంత ముందు నుంచి, ఆ యింట్లోంచి వెళ్ళిపోవాలనిపించింది రాఘవరావుకి. అయినా వీలు పళ్ళేదు. రాఘవరావు వెడతానన్నా వసంత వెళ్ళనివ్వలేదు. భోంచేసి కానీ వెళ్ళటానికి వీల్లేదంది.

రాఘవరావు మనసుని దొలుస్తూనే వుంది బాధ. 'ఇదివరకు చిన్నతనంలో తనలో యిలాంటి వూహల్లేవు. అప్పుడు తను వయస్సులో వున్నాడు. వసంతా యిప్పటికన్నా అందుబాట్లో వుంది. అయినా ఆమె మీద యిష్టమే తప్ప.... తనకి ఎప్పుడూ తప్పుడు ఆలోచనలేదు. ఆర్థికంగా అప్పుడు యిప్పటికన్నా చాలా తక్కువస్థితిలో వున్నాడు. అయినా ఆమె డబ్బు మీద ఆశ లేదు. అప్పుడు లేని దరిద్రం యిప్పుడు తన్నెందుకు పట్టుకున్నట్టు..

అదనపు సుఖం మీద, యీజీ మనీ మీద ఆశ మనిషికి సహజంగా వుండే బలహీనత.... యిన్నేళ్ళ తన పెరుగుదల, యిన్నేళ్ళ తన జీవితం వాటిని తనలో పెంచాయి అన్నది స్పష్టంగా తెలుస్తోంది. తన వ్యక్తిగత దోషానికి వెనకున్న సాంఘిక పునాది చూచాయగా తెలుస్తోంది.

"ఏమిటి రఘూ.... ఎందుకలా డల్‌గా వున్నావు. ఏదో ప్రమాదం జరిగినట్టు. ఏం మాట్లాడవేం" అనడిగింది చివరికి వసంత.

మొత్తం తన మనసులో జరిగిందంతా చెప్పేద్దాం అనుకున్నాడు రాఘవరావు. బరువు దింపుకుందామనుకున్నాడు. ఎలా చెప్పాలా అని మాటల కోసం వెతుక్కుంటున్నాడు.

యీలోగా వసంతే "నీకెలా వున్నా, నువ్వు రావటం నాకెంతో ఆనందంగా వుంది రఘూ..... చిన్నతనం స్నేహం.... వెర్రి కోరికలు.... యివన్నీ కలిపి మనం కోరుకునేదేమిటి రఘూ.... సంతోషం,

తృప్తి... పిల్లలు, సంసారం.... నేను బావున్నాను. నువ్వూ బావున్నావు. నిన్ను చూశాను. ఎంత తృప్తిగా వుందో తెలుసా. అదే నువ్వో, నేనో రోగాలు, బాధలు, చికాకులు వుండి కలిశాం అనుకో. ఎలా వుంటుంది. ఒకళ్ళనొకళ్ళు వోదార్చుకోవటం, బాధపట్టం. అవేం లేకుండా యిదెంత బావుంది. మనవాళ్ళు అనుకున్న వాళ్ళు బావుండటం కన్నా యింకేం కావాలి చెప్పు" అంది. ఆరోగ్యమైన వసంత ముఖంలో ఆమె మానసిక ఆరోగ్యం మరింతగా వెలుగుతూ కనిపించింది రాఘవరావుకి. ఇరుగూ, పొరుగూ బావుండాలన్న పాత పల్లెటూరి ఆకాంక్షే....దానికి మరో రూపం....

తన మనసుని అప్పటి వరకూ పట్టుకుని పీడించిన దరిద్రం గురించి యింక వసంతకి చెప్పాలనిపించలేదు రాఘవరావుకి. స్నేహితులు, చిన్ననాటి స్నేహితులు పరస్పరం పంచుకోవాల్సిన తృప్తి వేరే వుందనిపించింది.

ఆ తర్వాత వసంతని చూసినా, ఆ సాయంత్రం దాకా వసంత భర్త ఆమె పిల్లల్తో కలిసి ఆ యింట్లోనే వున్నా హాయిగా, తృప్తిగా వుంది రాఘవరావుకి.

- *యువ మాసపత్రిక, 1983*
- *Contemporary Short Stories, Anthology - 1989 (English)*
- *మాతృభూమి (మలయాళం), 26-1-89 (రిపబ్లిక్ డే ప్రత్యేక సంచిక)*
- *భారతీయ కహానియా - 1983, ప్రథమ సంపుటి (భారతీయ జ్ఞాన్‌పీఠ్ ప్రచురణ) - హింద*